రుణమాఫీ అందరికీ వర్తింపజేయాలి

మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, జూలై 16 : పంట రుణాల మాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను సవరించి రూ.2లక్షల వరకు రుణమున్న రైతులందరికీ లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 31 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. రీషెడ్యూల్‌కు సైతం ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయిన వారికి రుణమాఫీ వర్తించదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత పదేండ్లుగా బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో అసలుకు వడ్డీలు దాదాపుగా రూ.2లక్షల పైగా ఉన్నాయన్నారు. తక్షణమే అందరికీ రుణమాఫీ చేసేలా సవరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రేషన్ కార్డు ప్రామాణికం సరికాదు

సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుమారి జగన్

పాపన్నపేట, జూలై 16 : రైతు రుణమాఫీకి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొంటే చాలా మంది నిరుపేద రైతులు రుణమాఫీ అర్హత కోల్పోతారని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుమారి జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రేషన్‌కార్డు ప్రామాణికాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రుణమాఫీకి ఎలాంటి కొర్రీలు పెట్టలేదన్నారు. రూ.2లక్షల రూపాయల లోపు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

సమావేశంలో మాట్లాడుతున్న తాజామాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా

శివ్వంపేట, జూలై 16 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తామన్న రూ. 2 లక్షల పంట రుణమాఫీపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని శివ్వంపేట తాజా మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా అ న్నారు. మంగళవారం ఆయన శివ్వంపేటలో విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రజలను నమ్మించారని, తీరా అధికారంలో వచ్చి ఏడు నెలలు గడిచినా రుణమాఫీకి తాత్సారం చేస్తున్నార న్నారు. రుణమాఫీకి తెల్లరేషన్‌కార్డును ప్రామాణికం చేయడంతో చాలా మంది రైతులు నష్టపోతారని, వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ సర్కారు చేసిన మోసానికి రైతులు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పద్మవెంకటేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, వంజరి కొండల్, పోచాగౌడ్ పాల్గొన్నారు.

పంట రుణమాఫీకి ఆంక్షలు సరికాదు

బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాజు

చిన్నశంకరంపేట, జూలై 16 : పంటలకు ఇస్తామని హామీ ఇచ్చి న రూ.2లక్షల రుణ మాఫీకి ప్రభుత్వం ఆంక్షలు విధించి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం సరైంది కాదని బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాజు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ఇద్దరికి పట్టాపాసుబుక్‌లు ఉంటాయి.. రెండు రేషన్ కార్డులు ఉండవన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ మెదక్ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్

టేక్మాల్, జూలై 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.15వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి నేటి వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయక పోవడం కాంగ్రెస్ పాలన నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ మెదక్ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనలో రైతులకు పెట్టుబడి సాయం నిమిత్తం ఏడాదికి రూ.10వేలు అందించగా, ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఓట్లు తమకు సానుకూలంగా పడడానికి ఎకరానికి రూ.15వేలు అంటూ ఇచ్చిన హామీని సీజన్ ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు కూడా రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడంతో రైతులు పెట్టుబడి సాయం నిమిత్తం దళారులు, షావుకారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల పెట్టుబడి సాయం నిమిత్తం వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నర్సాపూర్, జూలై 16 : పట్టణంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వానకాల పంటల్లో ఎరువుల వాడకంపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొని రైతులతో చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ రైతుల ఉత్పత్తి సంస్థ మెంబర్లకు వారి కార్యకలాపాల నిర్వహణలో పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు విన్సెంట్ వినయ్, విజయనిర్మల, వ్యవసాయాధికారులు దీపిక, శ్రీనివాస్, రాజశేఖర్, ఏఈవోలు చంద్రవేణి, తేజస్విని, రుతు, దుర్గాప్రసాద్, హరిత మరియు రైతులు పాల్గొన్నారు.

బియ్యం నిల్వలపై పటిష్ట నిఘా

సాయిగీత రైస్‌మిల్‌లో బియ్యం స్టాక్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ బృందం

రామాయంపేట, జూలై 16 : రైసుమిల్లులో బియ్యం నిల్వలపై నిఘా ఉంచినట్లు మెదక్ టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ సంగారెడ్డి డీఎం కొండల్‌రావు, డీటీసీఎస్ రాజేశ్వరిలు పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట మండలంలోని సాయిగీత రైస్ మిల్లును టాస్క్‌ఫోర్సు విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విజిలెన్స్ టాస్క్‌ఫోర్సు కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రైసు మిల్లుల్లో బియ్యం స్టాక్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బియ్యం తరలింపులో మిల్లు యజమానులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రైసు మిల్లుల్లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై నవత, సిబ్బంది పాల్గొన్నారు.

ధరణి ద్వారా భూ పరిష్కారం

రైతుకు ధరణి పట్టా సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్ రజినీకుమారి

రామాయంపేట, జూలై 16 : 34 ఏండ్ల క్రితం కొనుగోలు చేసిన భూ పరిష్కారాన్ని కోర్టు అనుమతితో ధరణి ద్వారా స్థానిక తహసీల్దార్ రజనీకుమారి పరిష్కరించారు. మంగళవారం రామాయంపేట పట్టణానికి చెందిన కందుకూరి రాధాకిషన్‌కు తహసీల్దార్ పట్టా సర్టిఫికెట్ అందజేశారు. రామాయంపేట పట్టణ శివారు దామరచెర్వు సమీపంలోని 1990 సంవత్సరంలో 9ఎకరాల 5గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి భూమి విషయమై కోర్టులో కేసు నడుస్తున్నది. కోర్టు అనుమతితో రెవెన్యూ అధికారులు ప్రస్తుతం ధరణి ద్వారా 34ఏండ్ల తర్వాత కందుకూరి రాధాకిషన్ భూమిపై సర్వ హక్కులు తనకే చెందడంతో సంబంధిత తహసీల్దార్ ధరణిలో తనిఖీ చేసి సదరు భూ యజమానిగా రైతు కందుకూరి రాధాకిషన్‌గా గుర్తించి ఆయనకు ధరణి పట్టా సర్టిఫికెట్‌ను అందజేసినట్లు తహసీల్దార్ రజినీకుమారి విలేకరులకు తెలిపారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు
- ఊరూరా వనమహోత్సవం

శివ్వంపేట : శభాష్‌పల్లిలో మొక్కలు నాటుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు

శివ్వంపేట, జూలై 16 : మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యత అందరిదని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. భీమ్లాతండాలో పండ్ల తోటల పెంపకం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో అనిల్‌కుమార్, సాంకేతిక సహాయకులు రాజేశం, యాదయ్య, శ్రీను, పంచాయతీ కార్యదర్శి వీణ, ఎఫ్ఏ దామోదర్, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

అల్లాదుర్గం, జూలై 16 : మొక్కలు నాటి.. వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శంకర్ సూచించారు. వనమహోత్సవం సందర్భంగా చిల్వెర గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తులకు మొక్కలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో 15వేల పండ్లు, పూల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మంగళవారం 8వేల మొక్కలను ఆయా గ్రామాల్లో పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీవో సుధాకర్ ,పంచాయతీ కార్యదర్శి లింగప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ హనుమంతు పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి

కొల్చారం, జూలై 16 : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పోతిరెడ్డి పల్లి, నాయిన్ జలాల్‌పూర్, కొంగోడ్ గ్రామాల్లో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, సౌజన్య, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, యాదుల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం

వెల్దుర్తి, జూలై 16 : వనమహోత్సవానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మాసాయిపేటలో ఉన్న నర్సరీని ఏపీవో రాజుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి మండలంలో మొత్తం 30 నర్సరీలు ఉండగా 2.50 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అత్యధికంగా మాసాయిపేట నర్సరీలో 90 వేల మొక్కలు ఉన్నాయని తెలిపారు. వెల్దుర్తిలో ఇంటి ఆవరణలో నాటే మొక్కలను పంచాయతీ కార్యదర్శి బలరాం రెడ్డి మంగళవారం మహిళలకు పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కౌడిపల్లి, జూలై 16 : వన మహోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కౌడిపల్లి మండలం తునికిలో వనమహోత్సవంలో భగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటితే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీవో పుణ్యాదాస్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అందరూ బాధ్యతగా వ్యవహరించాలి

జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 16 : మొహర్రం ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు సిబ్బంది కృషి చేయాలని, ఇందు కోసం మొహర్రం నిర్వాహకులు, కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. బందోబస్తు సమయంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పీర్ల ఊరేగింపు సమయంలో సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు పోస్టులు చేస్తే వారి సమాచారాన్ని పోలీస్ ఐటీ సెల్ నంబర్ 8712657960 తెలియజేయాలని, వివరాలు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న రైతుల రిలే దీక్షలు

నర్సాపూర్‌లో రిలే నిరాహారదీక్ష చేస్తున్న రైతులు

నర్సాపూర్, జూలై 16 : కొండ పోచ మ్మ కాల్వ వద్దు సెమీ అర్బన్ ముద్దు అంటూ.. నర్సాపూర్‌లో రైతులు చేస్తు న్న రిలే నిరాహార దీక్ష 5వ రోజుకు చేరుకున్నది. మండల పరిధిలోని చిన్నచింతకుంట, జగ్యాతండాకు చెం దిన రైతులు మంగళవారం దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొండ పోచమ్మ కాల్వతో విలువైన భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొండపోచమ్మ కాల్వకు బదులు ఈ ప్రాంతాన్ని సెమీ అర్బన్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూమికి భూమి లేదా ఎకరానికి రూ.60 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతులు నరసింహారెడ్డి, బండారి శివ, మల్లయ్య, ఆంజనేయులు, రమేశ్, ప్యాట సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నిజాంపేట, జూలై 16 : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 18న ఉదయం 10.30లకు ఉపాధి హామీ పథకంపై మూడో విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

21న నల్ల పోచమ్మ బోనాలు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 16 : జిల్లా కేంద్రంలోని తారమకరామ నగర్ కాలనీలో ఆషాఢ మాసం పురస్కరించుకొని ఈనెల 21న మాత నల్లపోచమ్మకు బోనాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కౌన్సిలర్ నర్మాద, మాజీ కౌన్సిలర్ అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకుఎమ్మెల్యే రోహిత్‌రావు దంపతులు హాజరవుతారని తెలిపారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట : అంగన్‌వాడీ బడిబాటలో డాక్టర్ సాయిసౌమ్య

శివ్వంపేట, జూలై 16 : బాల్యదశలో అక్షర జ్ఞానానికి తొలిమెట్టుగా నిలుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ సాయిసౌమ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దొంతి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, చిన్నారులకు ఆరోగ్య పరిక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు షహీమున్నిసాబేగం, జ్యోతి, హేలత, అనురాధ, ఆశ వర్కర్లు మాధవి, శ్యామల, సునంద, తదితరులు ఉన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, జూలై 16 : బడి బయట ఉన్న చిన్న పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని రామాయంపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సృజన పేర్కొన్నారు. మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నాలుగు, పదో వార్డులో చిన్నారులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 20 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని కేంద్రాల్లో బడి బయట ఉన్న చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించడమే అక్ష్యంగా టీచర్లు పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సంగీత, వర్ణలత ఉన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, జూలై 16 : మూ డు నుంచి ఆరేండ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పం పించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరళకుమారి తెలిపా రు. మంగళవారం నర్సాపూర్ నర్సాపూర్ మున్సిపాలిటీలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట, పాటలతో మంచి బోధన అందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, వార్డు ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై ఆందోళన

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు

వెల్దుర్తి, జూలై 16 : రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్సై నవత, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. వెల్దుర్తి మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన బర్ల లక్ష్మి (52) గత గురువారం పని నిమిత్తం వెల్దుర్తికి ఆటో లో వచ్చి పట్టణంలోని బాలాజీ దవాఖాన వద్ద ఆటో దిగి వెళ్తుండగా, వెల్దుర్తి పట్టణానికి చెందిన ఓ యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి లక్ష్మిని బలంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మంగళవారం వేరే దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందింది. బైక్ డీకొన్న ఘటనపై శనివారం బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడిచినా నేటికి బైక్‌ను, ప్రమాదానికి కారణమైన యువకుడిని అదుపులోకి తీసుకోకపోవడంపై బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులపై అనుమానం వ్యక్తం చేస్తూ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. చిన్న చిన్న ఫిర్యాదులపై స్పందించే పోలీసులు ప్రమాదం జరిగి, బాధితురాలు చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతుంటే వెల్దుర్తి ఎస్సై, సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బైక్‌ను నడిపిన యువకుడి తల్లి, నాయకులతో పోలీసులు కుమ్మక్కై తమకు అన్యాయం చే స్తున్నారని బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారు లు స్పందించి, తమకు చేయాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపారు. బైక్ నడిపిన యువకుడిని బుధవారం పిలిపించి న్యాయం చేస్తామని పోలీసులు తెలియజేయడంతో ఆందోళనకు విరమించారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు మంజూరు

రామాయంపేట, జూలై 16 : పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు రామాయంపేట ఎంపీడీవో షాజులిద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలల వేతనాలను తమ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. త్వరలోనే పంచాయతీల వారీగా పారిశుధ్య కార్మికులకు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.

వర్షాలు కురవాలని పూజలు

వెల్దుర్తి, జూలై 16 : వర్షాలు సమృద్ధిగా కురవాలని శివలింగానికి వర్ష పశుపాత అభిషేకం నిర్వహించినట్లు రంగంపేట పీఠాధిపతి శిష్యులు శ్రీమధుసూదనానంద స్వామి అన్నారు. వర్షాలు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో భక్తులు మంగళవారం బస్వాపూర్ పంచాయతీలోని భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివలింగానికి పంచపత్రాలు, పంచామృతాలతో వర్ష పశుపాత అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నా దాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రమాదకరంగా ఎంపీడీవో పాత భవనం

శిథిలావస్థకు చేరుకున్న ఎంపీడీవో కార్యాలయ పాత భవనం

నర్సాపూర్, జూలై 16: మండల కేంద్రంలోని ఎంపీడీవో పాత భవ నం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భ యాందోళన చెందుతున్నారు. ఈ భవనం సమీపంలోనే ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాలు, ఆధార్ కేంద్రం ఉండడంతో వివిధ పనుల కోసం వచ్చి న ప్రజలు నిత్యం ఈ భవనం కిందనే సేదతీరుతుంటారు. ప్రస్తుతం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోనని అనుమానాలు కలుగుతున్నాయి. ఈ భవనాన్ని తక్షణమే తొలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

డీలర్లకు మొబైల్ వాట్సాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఏవో గోవిందు

చిన్నశంకరంపేట, జూలై 16 : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవ సాయశాఖ అధికారి గోవిందు రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గవ్వల పల్లి, మడూరు గ్రామాల్లోని ఆగ్రో కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన డీలర్లకు వాట్సాప్ మొబైల్, పంటల సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆగ్రో కేంద్రాల్లో రికార్డులను పరశీలించారు. ఆయన వెంట మండల వ్యవ సాయశాఖ అధికారి లక్ష్మీప్రవీణ్ ఉన్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 16 : మోహర్రం పుర స్కరించుకొని మంగళవారం పట్టణంలో పీర్లను ఘనంగా ఊరేగించారు. చమన్ ప్రాంతంలోని ఇమాం ఏ జామిన్ ఫీర్లను, ఖాదర్ బంగ్లాకు చెందిన ఇమాం ఏ ఖాసీం ఫీర్లను చమన్ చౌరస్తాకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. చమన్‌లో ఇరు ఫీర్లు కలుసుకున్న తర్వాత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

ముస్లింలకు మొహర్రం శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : ముస్లింలకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. మొహర్రం పండుగ త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అని, విశ్వాసం, నమ్మకం కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవటమే పండుగ ప్రత్యేకత అన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

లయన్స్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు

నర్సాపూర్, జూలై 16 : నర్సాపూర్ లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధు నూతన కమిటీని ఫస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ రామకృష్ణరెడ్డి, పీడీటీ లయన్ నరసింహారెడ్డి, జిల్లా పీఆర్‌వో లయన్ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో మంగళవారం నర్సాపూర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నర్సాపూర్ శాఖ అధ్యక్షుడిగా మంద జైపాల్, కార్యదర్శిగా కొండా శ్రీకాంత్, కోశాధికారిగా మాణిక్యంగౌడ్‌లను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట, జూలై 16 : నిజాంపేటకు చెందిన పంజా సత్తయ్య 10 రోజుల క్రితం సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు సీఈఐఆర్ వెబ్ సైట్ ద్వారా వెతికి పట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి బాధితుడికి అప్పగించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు కంగారు పడకుండా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

న